ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట పార్టీ నేతలు సంపత్ మాధవరెడ్డి, బాలరాజు, సాయి, సమ్మయ్య ఉన్నారు.

- కుత్బుల్లాపూర్, మార్చి 31

ఘన సన్మానం

బాలానగర్, మార్చి 31 : సీనియర్ సిటిజన్లు శేష జీవితంలో ఆనందంగా గడపాలని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ నరసింహయాదవ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పీవీ ఎంక్లేవ్‌లో స్నేహ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేఖల శ్యాంసుందర్‌రావు పుట్టినరోజు సందర్భంగా అభినందన సభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు పూల మొక్కలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్‌రావు, సత్తయ్య, విద్యాసాగర్, అమృతరావు, విజయకుమార్, బక్కరెడ్డి, లింగం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జీడిమెట్ల, మార్చి 31 : జీడిమెట్ల ఆర్టీసి డిపో పరిసర ప్రాంతంలో నివసించే ప్రజలకు రవాణా సమస్యలపై మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీడిమెట్ల డిపో మేనేజర్ కే.ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్వీసు సేవలకు సంబంధించి సమస్యలు, సలహాలు, ఫిర్యాదులు చేసేందుకు 9959226150కు సంప్రదించాలని కోరారు.

ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోండి

మియాపూర్, మార్చి 31: ఆస్తి పన్ను చెల్లింపునకు ప్రభుత్వం కల్పించిన ఎర్లీ బర్డ్ స్కీం పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి కోరారు. ఈనెల 30వరకు ఇందుకోసం గడువు ఉన్నందున అడ్వాన్స్ పన్నులు చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని కోరారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను మొత్తాన్ని ఏకకాలంలో ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా చెల్లించి ఐదు శాతం రాయితీని పొందాలన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

మల్కాజిగిరి, మార్చి 31:ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం.. లక్ష్మీనగర్ కాలనీలో బుధవారం ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. పోలీసు కేసు నమోదు చేసుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్న హస్మత్‌పేటక్ చెందిన కౌశిక్, ఎల్బీనగర్‌కు చెందిన రవితేజలను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించడంతో చోరీ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.9లక్షల నగదు, 12తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి ఎల్లమ్మ కల్యాణోత్సవాలు

కీసర, మార్చి 31: కీసరలోని పెద్దమ్మ పెద్దిరాజు, రేణుకా ఎల్లమ్మ జమదగ్ని మునిరాజుల కల్యాణ మహోత్సవం వేడుకలను ఈనెల 1,2వ తేదీల్లో నిర్వహిస్తున్నామని ముదిరాజ్ సంఘం నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు అమ్మవార్లకు పుట్ట కమ్ముట, సాయంత్రం 5గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, రాత్రి 7గంటలకు అమ్మవార్లకు గంగ తిప్ప ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

కాప్రా సర్కిల్‌లో ఆస్తిపన్ను కలెక్షన్లు రూ.60.37 కోట్లు

కాప్రా: సర్కిల్‌లోని 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోమవారం సాయంత్రం వరకు ఆస్తి పన్ను మొత్తం రూ.60.37 కోట్లు వసూలైంది. కాప్రా సర్కిల్ ఆస్తి పన్ను వసూలు టార్గెట్ రూ.61.19 కోట్లు కాగా, లక్ష్యానికి కేవలం రూ.81.81 లక్షలు మాత్రమే తక్కువగా రూ.60.37 కోట్లు వసూలు అయ్యాయి. ఆస్తి పన్ను తుది వివరాలు మంగళవారం అందుతాయని అధికారులు వెల్లడించారు.

కురుమల ఐక్యతకు కృషి చేయాలి

ఉప్పల్ మార్చి 31: కురుమ సంఘం ఎన్నికల్లో అందరూ ఐక్యంగా ఉండి రాష్ట్ర ఎన్నికల్లో పాల్గొనుటకు కురుమ కులస్తులందరూ సంఘ సభ్యత్వం చేయించాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు గొరిగే రమేశ్ కోరారు.ఉప్పల్ జోన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి ఆలయంలో సోమవారం కురుమ సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. గొరిగే బక్కయ్య కురుమ జ్ఞాపకార్థంగా రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి ప్రముఖ హైకోర్టు న్యాయవాది గొరిగే మల్లేశ్ కురుమ ,కురుమ విద్యార్థుల శిక్షణ కోసం ఉప్పల్ కురుమ సంఘానికి డెల్ కంప్యూటర్‌ను బహూకరించారు. ఈనెల3న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న దొడ్డి కొమురయ్య కురుమ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కేపీహెచ్‌బీ కాలనీలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

హైదర్ నగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్గాల వద్ద రంజాన్ వేడుకలు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లీంలు పండుగ శుభాకాంక్షలు తెలిపిన వివిధ పార్టీల నాయకులు

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

మియాపూర్ మార్చి 31: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రంజాన్ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, మియాపూర్, ఆఫీస్‌పెట్, చందానగర్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, షేర్‌లింగంపల్లి డివిజన్లలో ముస్లింలు ప్రార్థనలను చేశారు. హైదర్‌నగర్‌లో ఈద్గా వద్ద ముస్లిం ప్రార్థనలకు తగు వసతులను ఎమ్మెల్యే కృష్ణారావు కల్పించారు. కాగా డివిజన్ బీఆర్ఎస్ నేతలు ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మియాపూర్ డివిజన్ మైనార్టీ నేత అన్వర్ షరీఫ్ నివాసంలో రంజాన్ నిర్వహించారు.

నిజాంపేటలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, వివిధ పార్టీల నేతలు

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద రంజాన్ వేడుకలు జరిగాయి. ఇందులో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

దుండిగల్ మునిసిపాలిటీ పరిధి మల్లంపేట్‌లో సోమవారం దర్గాలో జరిగిన వేడుకల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్‌నేత, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాదాస్ వెంకటేశ్, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ రంగయ్య, నాయకులు ఉస్మాన్, జాకీర్, మైనారిటీలు పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, నిజాంపేట్ లోని ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనలకు ముస్లింలు హాజరయ్యారు.

అల్లాపూర్ : అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్ నగర్ ఈద్గాలో ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జహీద్ షరీఫ్‌బాబా ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు.

కొండాపూర్‌లో..

కొండాపూర్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. ప్రార్థన అనంతరం ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బాలానగర్ : ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ పరిధిలోని వల్లబ్‌నగర్ ఈద్గాలో మైనార్టీలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నరసింహ యాదవ్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

బాలానగర్‌లో..

బాలానగర్ డివిజన్‌లో నిర్వహించిన వేడుకలకు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి హాజరై మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫతేనగర్‌లో..

ఫతేనగర్ డివిజన్ పరిధిలోని మైనార్టీ నేతలను పలువురు కలిసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, కన్నయ్య, బాగయ్య, సురేందర్ నాయుడు, సందీప్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ 4వ పేజ్ ఈద్గాలో జరిగిన వేడుకల్లో నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ శ్రీనివాసరావు ప్రార్థనలు చేశారు. వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

అల్లాపూర్‌లో..

కేపీహెచ్‌బీకాలనీలో కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

మల్లంపేట్ లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు

కొండాపూర్ లో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

బాలానగర్‌లో ముస్లింలతో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

ఫతేనగర్ డివిజన్‌లో మైనార్టీలతో కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం

అబిడ్స్, మార్చి 31 : భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభమైంది. సిద్ధంబర్ బజార్ లోని బాహితిభవన్లో కమిటీ చైర్మన్ డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ రాఠీ, కమిటీ సభ్యులు కరుడి మాల్ నరసింహ పూరియా పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆలయ పూజారి రాజు మహారాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ భగవంతరావు మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు శ్రీరామనవమి ఉత్సవ సమితి ఊరేగింపు నిర్వహించే అవసరం ఉందదన్నారు. ప్రధాన కార్యదర్శి గోవింద నారాయణ రాఠీ మాట్లాడుతూ.. 2010 నుంచి శ్రీరామనవమి ఊరేగింపును కమిటీ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2024 వరకు జరిగిన ఈ ఊరేగింపులో పోలీసుశాఖ అన్నిఏర్పాట్లు చేపట్టిందని ఈసారి కూడా పోలీసుశాఖ ఏర్పాటు చేస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీనుంచి ఆశించిన మేరకు సహకారం అందరం లేదని వాపోయారు. అధికారులు స్పందించి ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం ఆధ్వర్యంలో ఆవును పూజించి పచ్చడి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్ గుప్తా, శ్రీరామ్ వ్యాస్, కార్పొరేటర్ రాకేశ్‌జైస్వాల్, కమల్ సింగ్, రాజాసింగ్, నటరాజ్ నాంధారి, గోల్కొండ ప్రెసిడెంట్ ఉమామహేంద్ర, అశోక్, గాంధీ, మురళి, రాము, విజయ్, అశ్విన్, సుమిత్రా, పరమేశ్వరి సింగ్, పవన్ మిశ్రా, సంజయ్ ,వెంకటేష్, అరుణ జ్యోతి, రఘునందన్ యాదవ్, చింత సామామూర్తి, నిరంజన్ యాదవ్, సంతోష్, బంగారు సంతోష్, రాజేశ్ శర్మ, శ్రీకృష్ణ శరకేశ్ శర్మ , జుగల్ సోనీ, రవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, మార్చి 31 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఉగాది వసంతోత్సవాల్లో మూడవ రోజు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సోమవారం నాట్య గురువులు శీనయ్య శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. బ్రహ్మాంజలి, ప్రణమామ్యహం, జతిస్వరం, శ్రీ విజ్ఞారాజం భజే, దశావతార శబ్దం, జనుత శబ్దం, గణపతి కౌతం, హిందోళం తిల్లాన అంశాలను భవిష్య, హ్రితిక, వార్షిత, హంసిని, సిద్ధి, మేఘన, శాన్వి, ఈషా కృష్ణ, సాన్విక, గౌరీ, రుషిక, ఇందీవరా, సమీనా, ద్రువి, జాన్వీ, రిద్ధి, దీప్సిక ప్రదర్శించి మెప్పించారు.

'ప్రేమంటే ఇదేనా' సందేశాత్మక నాటిక ప్రదర్శన

మల్లాపూర్, మార్చి 31: రాష్ట్ర చలన చిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ రాధా ఆర్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో 'ప్రేమంటే ఇదే నా' నాటిక ప్రదర్శన సోమవారం నెహ్రూనగర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహిత మాడుగుల కృష్ణమోహన్ రచననటన, దర్శకత్వం వహించిన ఈ నాటిక ప్రదర్శనలో నటీ నటులు తమ నటనతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నటీ నటు లు.. జగపతి, ప్రసాద్ పాత్రలో మాడుగుల కృష్ణమోహన్, రంగస్థల టి.వి నటుడు ధనుంజయ పాత్రలో ఐరేని రమేష్‌గౌడ్, నట చంద్రకళ, సహజనటి, చలాకి తారబిరుదు గ్రహిత ప్రమీల పాత్రలో జి. మనుప్రియ, ఆకెళ్ల గోపాలకృష్ణ, దొంతి జంగయ్యగౌడ్, ఎ.వి.బి.వి రాయలు, నాగరాజ్ పాల్గొన్నారు.

నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

కవులకు సన్మానం

మేడ్చల్, మార్చి 31: జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని వెంకటరామయ్య కాలనీ హనుమాన్ మందిర్‌లో ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న 20 మంది కవులు ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎంతో మంది కవులు తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యానికి కృషి చేశారన్నారు. తమ కలం జాలు వారిన సిరా చుక్కలు కోటి చుక్కలై ఉద్యమాలకు ఊపిరిపోశాయని, సమాజంలో మార్పు తీసుకువచ్చాయన్నారు. ఉగాది సందర్భంగా కవులును సన్మాంచిండం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మెదక్ డీఈవో రాధా కిషన్, జాతీయ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నర్సింలు, భూసాల సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ అమర్నాథ్‌రెడ్డి, మల్లికార్జున, కిషన్ రావు పంతులు, వంశీ, సుధాకర్ రెడ్డి , పవన్ కుమార్, కృష్ణమాచార్య పంతులు, రాధాకృష్ణ, రఘురాం పటేల్ పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న డీఈవో రాధాకిషన్, జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నర్సింలు తదితరులు

రోడ్ల విస్తరణతో మారనున్న జవహర్‌నగర్ రూపురేఖలు

జవహర్‌నగర్, మార్చి 31: రోడ్ల విస్తరణతో జవహర్‌నగర్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని, శరవేగంగా నలువైపులా రహదారుల పనులు జరుగుతున్నాయని తహసీల్దార్ సుచరిత అన్నారు. కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశాల మేరకు తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో కార్పొరేషన్ లోని చెన్నాపురం చౌరస్తా నుంచి నలువైపులా విస్తరిస్తున్న రోడ్డు పనులను సోమవారం హెచ్ఎండీఏ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు ఎలాంటి ఆటంకాలు లేవని, పనులు వేగంగా జరుగుతున్నాయని, చెన్నాపూర్ నుంచి డెంట్‌కా లేజీ రోడ్డులో విస్తరణ పనులు మొదటిదశకు చేరువలో ఉందని, కరెంటు స్తంభాలు, చెట్లను తొలగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఏఈఈ జీవన్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్,టీపీఓ శ్రవంతి, రెవెన్యూ, మున్సిపల్, హెచ్ఎండీఏ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ అధికారులతో కలిసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుచరిత

సేవలందించిన అధికారులను ప్రజలు మరువరు

రామంతాపూర్,మార్చి 31: రామంతాపూర్ ప్రభుత్వ హోమియో దవాఖానలో రీసర్చ్ ఆఫీసర్‌గా 33 సంవత్సరాలు రోగులకు సేవలందించిన డాక్టర్ వి. శ్రీదేవి సోమవారం పదవీ విరమణ చేశారు.కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ లింగారాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పలువురు డాక్టర్లు ఆమె ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. సమయ పాలన అంకితం భావంతో పనిచేసిన ఉద్యోగులను ప్రజలు గుర్తుంచుకొంటారన్నారు.డాక్టర్ శ్రీదేవీ తన పదవీ కాలంలోసమయ అంకిత భావంతో పనిచేశారని కొనియాడారు. శేష జీవితం ఆనందంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ విజయ, ఫార్మసీ డాక్టర్ రాచందర్,తెలంగాణ ప్రభుత్వహోమియో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శిడాక్టర్ దాసరి పార్థసారథి, పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్, మార్చి 31: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై పేట్ బషీరాబాద్ పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. ఆదివారం రాత్రి దూలపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో 8 మంది ప్లేయింగ్ కార్డులు ఆడుతుండగా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ. 27600 నగదు, 19,200 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, మార్చి 31: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం జార్ఖండ్ ప్రాంతానికి చెందిన మహేంద్ర చౌదరి (34) కొన్ని నెలల కిందట నగరానికి వలస వచ్చి కొంపల్లిలోని గార్డెన్ హౌసింగ్ సొసైటీ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. ఈ నెల మార్చి 30న మధ్యాహ్నం సమయంలో తన బంధువు లాలు చౌదరితో కలిసి సరుకులు తేవడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో కొంపల్లిలోని సినీ ప్లానెట్ ఎదురుగా జాతీయ రహదారి క్రాస్ చేస్తుండగా మేడ్చల్ నుంచి సుచిత్ర వైపునకు వెళ్తున్న కారు మహేంద్ర చౌదరిని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్ గ్యాస్.. నో రెస్పాన్స్

పండుగ పూట ఫోన్లు ఎత్తని డిస్ట్రిబ్యూటర్ ఇబ్బందులు పడ్డ వినియోగదారులు

దుండిగల్, మార్చి31: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ పూట భారత్ గ్యాస్ వినియోగదారులకు డిస్ట్రిబ్యూటర్ చేదు అనుభవాన్ని రుచి చూపించారు. భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుల ఫిర్యాదులకు స్పందించకపోవడంతో పండగపూట వంట గ్యాస్ లేక కొందరు ఇబ్బంది పడాల్సి వచ్చింది. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి పలుమార్లు ఫోన్ చేసినా అటువైపు నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వినియోగదారులు చికాకు పడాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట, ప్రగతి నగర్, బాచుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది కుటుంబాలకు కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీ కేంద్రంగా పనిచేస్తున్న బంగారు సాయి ఏజెన్సీ భారత్ గ్యాస్ (వంటగ్యాస్)ను సరఫరా చేస్తోంది. అయితే ఇటీవల కాలంలో వినియోగదారులకు సంబంధించిన ఫోన్లను ఎత్తడంలో బంగారు సాయి ఏజెన్సీ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఏజెన్సీ నిర్వాహకులు అసలు ఫోన్ ఎత్తడం లేదని ప్రజలు ఆరోపించారు. ఇదే విషయాన్ని రుజువు చేస్తూ ఆదివారం ఉగాది రోజున ఓ వినియోగదారుడు ఇంట గ్యాస్ బండ ఖాళీ అవడంతో దానిని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. అయితే అతడికి రెండో సిలిండర్ ఉండడంతో ఎలాంటి ఇబ్బంది లేదు అనుకుని మార్చేందుకు సిద్ధమయ్యాడు. కానీ ఇటీవలే తీసుకున్న బండ సిలిండర్ వాల్వు సరిగా పనిచేయకపోవడంతో రెగ్యులేటర్ బిగించడం కష్టంగా మారింది. ఇదే విషయాన్ని డెలివరీ బాయ్‌కి ముందుగా ఫోన్ చేసిన వినియోగదారుడికి కొద్దిసేపట్లోనే మెకానిక్‌ను పంపిస్తానని చెప్పడంతో మెకానిక్ కోసం 48 గంటలు వెయిట్ చేయాల్సి వచ్చింది. ఓవైపు ఉగాది పండగ మరోవైపు వంటగ్యాస్ సిలిండర్ లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నప్పటికీ రెండు రోజులు గడిచినా మెకానిక్ రాలేదు. దీంతో విసుగు చెందిన వినియోగదారుడు ఏజెన్సీ నంబర్ కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన కానరాలేదు. భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గత కొంతకాలంగా వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు చేసే ఫోన్‌కాల్స్‌ను స్వీకరించడం లేదని పలువురు భారత్ గ్యాస్ వినియోగదారులు వాపోతున్నారు.